# ఆ రక్తం రంగు తెలుపు


"హతుడి బంధువులు ఎవరైనా వచ్చారా?" అడిగాడు హైదరాబాద్‌లోని అఫ్జల్ గంజ్ ఇన్‌స్పెక్టర్ శేషు.

"లేదుసార్!....కానీ ఆ శవాన్ని మార్చురీనుంచి తొలగించమని సిబ్బంది గొడవ చేస్తున్నారు సార్" చెప్పాడు కానిస్టేబుల్.

"హతుడిని గుర్తించకుండా శవాన్ని ఎలా తొలగిస్తాం? కొన్ని రోజులు ఆగమని చెప్పండి."

ఇన్‌స్పెక్టర్ ఆదేశాన్ని అందుకుని వెళ్లి పోయాడు కానిస్టేబుల్.

గౌలిగూడ ఇమ్లిబన్ పార్కులో హత్యకు గురైన ఒక గుర్తు తెలియని యువకుడి శవాన్ని స్వాధీన పరచుకుని ఇప్పటికీ వారం రోజులైంది. పెద్ద బండతో తల పగల గొట్టిన కారణంగా ఆ




యువకుడు మరణించాడు.

అయితే ఆ హతుడు ఎవరు? హంతకులు ఎవరు? ఎందుకు హత్య చేశారు? అనే విషయాలు మిస్టరీగానే వున్నాయి. హతుడి శవానికి పోస్టుమార్టమ్ జరిపించారు. శవాన్ని హతుడి గుర్తింపుకోసం అఫ్జల్‌గంజ్ పోలీసులు మార్చురీలో భద్రపరిచారు. అంతేగాక ఆనవాళ్లతో నిబంధనల ప్రకారం పత్రికలలో హతుడి ఫోటోతో ప్రకటన కూడా వేయించారు. అయినా ఫలితం లేకపోయింది. హతుడిని గుర్తించటానికి బంధువులు ఎవరూ రాలేదు. హతుడు ఎవరైందీ తెలిసేనేగాని హత్యకు సంబంధించిన కారణాలు, హంతకుడెవరూ తేల్చడానికి వీలవుతుంది. హతుడు నగరానికి చెందిన వ్యక్తి కాకపోవచ్చు. అతను నగర నివాసి అయి వుంటే ఈపాటికి బంధువులు, కుటుంబసభ్యులు ఎవరైనా వచ్చేవారు.

కేసు ఫైలును ముందు పెట్టుకుని ఆలోచిస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ శేషు.

ఇన్‌స్పెక్టర్ ఆలోచనలకు బ్రేకు వేస్తు వచ్చిన ఎస్.ఐ.మహ్మద్ ఇస్మాయిల్,

"సార్ హత్య చేసినవారు కూడా స్థానికులు కాకపోవచ్చు." అన్నాడు అనుమానంగా.

"కావచ్చు. ఏమైనా స్థానిక రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ శక్తులపైకూడా ఓ కన్నేసి వుంచండి. ఈ హత్య లో వారి హస్తం వుండివుంచ్చు." ఆదేశించాడు ఇన్‌స్పెక్టర్ శేషు.

*** ***

హత్యకు సంబంధించి అదనంగా ఏదైనా క్లూ దొరుకుతుందేమోనన్న ఆశతో మరో మారు హత్య జరిగిన స్థలాన్ని చూడసాగాడు ఎస్.ఐ.మహ్మద్ ఇస్మాయిల్. ఎలాంటి ఆధారం దొరకలేదు. జరిగిన హత్య గురించి సమాచారం అందించిన పార్కు మాలి బాబూరావును మరోమారు ప్రశ్నించాడు ఎస్.ఐ.

"హత్య జరిగిన రోజుగాని, అంతకు ముందుగాని హతుడు ఇక్కడ తిరిగాడా?"

"లేదు సార్!...హతుడిని ఇంత వరకు ఎప్పుడూ చూడలేదు. ఇతర కొత్త మనుషులుకూడా ఎవరూ ఇక్కడ కనిపించలేదుకూడా." చెప్పాడు మాలి. తనకు కావలసిన ఏ ఆధారం మాలి దగ్గర లభించదనే నిర్ధారణకు వచ్చిన ఎస్.ఐ.అక్కడినుంచి బయలుదేరాడు. రాను రాను ఈ కేసు కొరకరాని కొయ్యగా తయారవుతోంది. అన్ని కోణాలనుంచి దర్యాప్తు సాగిస్తున్నప్పటికి కావలసిన క్లూ దొరకడంలేదు. చివరికి ఈ కేసు తేలుతుందా? హంతకుడిని పట్టుకోగలమా? అనే అనుమానం పోలీసు అధికారులకు వచ్చింది. అయినా పట్టువదలకుండా దర్యాప్తును కొనసాగిస్తున్నారు. అనుమానితులను విచారిస్తూనే వున్నారు.

అప్పటికీ నెలరోజులు గడిచిపోయాయి.

ఒకరోజు ఒక వృద్ధుడు మరో మహిళ కలసి అఫ్జల్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు.

"ఏం కావాలి?" అడిగారు పోలీసులు.

"సాబ్!...మాది కర్ణాటక రాష్ట్రంలోని ధూప్‌మల్‌గావ్ గ్రామం. నల్లగొండజిల్లా చిట్యాలలోని ఒక హోటల్‌లో నా కొడుకు నవనాథ్ పనిచేస్తాడు. నెలరోజుల క్రితం ఊరికి వెళ్తానని బయలుదేరి ఇంతవరకు ఇంటికి రాలేదు. గౌలిగూడ బస్‌స్టేషన్‌లో బస్సెక్కి రావాలి. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. మీకు ఫిర్యాదు చేద్దామని వచ్చాం." తెలిపింది ఆ మహిళ.

'నీ పేరు?"

"కళావతి. ఈయన మా అన్న పాండు."

అప్పుడే వచ్చిన ఇన్‌స్పెక్టర్ శేషు,

"వాళ్లెవరు? ఎందుకోసం వచ్చారు?..." అంటూ అడిగాడు.

వివరించాడు కానిస్టేబుల్.

ఒకవేళ గుర్తు తెలియని ఆ హతుడు ఆమె కొడుకైతే కాదుగదా! ఎందుకైనా మంచిదని లోపలదాచిన హతుడి బట్టలను చూపించమని కానిస్టేబుల్‌ను ఆదేశించాడు ఇన్‌స్పెక్టర్.

కళావతిని లోపలికి తీసుకుపోయి గుర్తు తెలియని హతుడి తాలూకు బట్టలను చూపించారు పోలీసులు. రక్తపు మరకలతో ఉన్న ఆ బట్టలను ఎవరివో తనకు తెలియదని ఆమె చెప్పింది.

హతుడి ఫోటోను చూడగానే అది తన కుమారుడిదేనంటూ గుర్తించింది.

అతడు హత్యకు గురయ్యాడని చెప్పగానే కళావతి అక్కడే కూలబడిపోయి భోరున విలపించింది. అనంతరం మార్చురీకి ఆమెను తీసుకుపోయి శవాన్ని చూపించారు పోలీసులు. చెట్టంత కొడుకు మరణించాడనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. తర్వాత ఆమెను స్టేషన్‌కు తీసుకుపోయిన పోలీసులు ఆమెను కొంతసేపటివరకు మాట్లాడించలేదు.

" నీ కొడుక్కి ఎవరైనా శత్రువులున్నారా?" మెల్లిగా అడిగాడు ఇన్‌స్పెక్టర్ శేషు.

"నాకు తెలిసినంతవరకు నవనాథ్‌కు శత్రువులు ఎవ రూ లేరుసార్. రెండు సంవత్సరాల క్రితం పనికోసం నల్లగొండ జిల్లా చిట్యాలకు వచ్చాడు. అక్కడ ఒక హోటల్‌లో పనికి చేరాడు. నెలకు 1200 రూపాయల జీతానికి పని చేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితమే నేను కొడు కు దగ్గరకు పోయాను. మన ఊరికిపోయి అక్కడే ఏదైనా పని చేసుకుందామని చెప్పాను. జీతం రాగానే వచ్చేస్తాను. ముందు నీవు వెళ్లు..." అని నన్ను పంపించి వేసాడు....ఇక వస్తాడని ఎదురు చూస్తున్న మాపై దేవుడు చిన్నచూపు చూసాడు." అంటూ కళావతి విల పించింది.

"నీకెవరిమీదైనా అనుమానం వుందా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ శేషు.

"లేదుసార్! కానీ నా కొడుకు కొన్న రేడియో అతని స్నేహితుడు శివరాజ్ దగ్గర చూసాను..." చెప్పింది కళావతి.

"ఎక్కడ?" హత్య మిస్టరీని ఛేధించాలన్న ఆశతో ఆతృతగా అడిగాడు ఎన్‌స్పెక్టర్.

"నాంపల్లి దగ్గర రిక్షా తొక్కుతూ మాకు కనిపించాడు సార్. అప్పుడే అతని దగ్గర ఆ రేడియో చూసాము." చెప్పింది ఆమె.

శివరాజ్‌ను విచారిస్తే ఏమైనా ఫలితం దక్కవచ్చు. వెంటనే ఎస్.ఐ.ఇస్మాయిల్‌ను పిలిచిన ఇన్‌స్పెక్టర్ శివరాజ్‌కోసం గాలించమని ఆదేశించాడు.

కళావతిని వెంట బెట్టుకుని నాంపల్లి ప్రాంతంలో శివ రాజ్‌కోసం గాలించసాగాడు ఎస్.ఐ.ఇస్మాయిల్.

ఎడతెరిపి లేకుండా జరిపిన గాలింపులు ఫలించి ఎట్టకేలకు శివరాజ్‌ను పట్టుకోగలిగారు.

నవనాథ్ హత్యకు గురైన విషయం తనకు తెలియదని, ఆ రేడియోను నవనాథ్ తనకు విక్రయించాడని శివరాజ్ పోలీసులకు చెప్పాడు. శివరాజ్ అబద్ధమాడుతున్నాడని గ్రహించిన పోలీసులు శివరాజ్‌ను గద్దించి అడ గడంతో అసలు విషయాన్ని బయటపెట్టాడు. నవనాథ్‌ను తాను మరో స్నేహితుడు రాజు కలిసి హత్య చేసినట్టు శివరాజ్ అంగీకరించాడు.

"రాజు ఎక్కడున్నాడు?" అడిగాడు శేషు.

"దారూసలాకు దగ్గరగా వున్న దాల్‌మండిలో పనిచేస్తున్నాడు సార్."

వెంటనే పోలీసులు దాల్‌మండిలో పనిచేసే రాజును అదుపులోకి తీసుకున్నారు.

వీడదనుకున్న నవనాథ్ హత్య మిస్టరీని ఛేధిస్తున్నందుకు ఇన్‌స్పెక్టర్‌కు ఉత్సాహంగాను, సంతోషంగాను ఉంది.

" నవనాథ్‌ను ఎందుకు చంపారు?" శివరాజ్, రాజులను గద్దించి అడిగాడు ఇన్‌స్పెక్టర్.

ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు మెల్లిగా నోర్లు విప్పారు.

*** ***

కర్ణాటక రాష్ట్రం బీదర్‌జిల్లా ధూప్‌మల్‌గావ్‌కు చెందిన నవనాథ్ సొంత ఊళ్లో బతకలేక పనివేటలో ఆంధ్రప్రదేశ్ చేరుకున్నాడు. చివరికి నల్లగొండ జిల్లా చిట్యాలలోని ఒక హోటల్‌లో పనికి కుదిరాడు. నెలకు 1200 రూపాయల జీతం వచ్చేది. కొద్ది రోజుల తర్వాత తల్లి కళావతి కొడుకు దగ్గరకు వచ్చింది. ఊరుకాని ఊరులో కొడుకు పడుతున్న కష్టాన్ని చూసి భరించలేకపోయింది.

"ఇదే జీతంతో మన ఊళ్లోకూడా పని దొరుకుతుంది, వెంటనే సొంత ఊరికి వెళిపోదాం." కొడుకును కోరింది తల్లి.

మొదట అంగీకరించని నవనాథ్ ఆ తర్వాత తల్లి మొండిపట్టుకు తలొగ్గాడు. ముందు తల్లిని వెళ్లి పొమ్మని చెప్పి తాను జీతం తీసుకొని వస్తానని చెప్పాడు.

హోటల్ యజమాని తనకివ్వాల్సి మూడు వేలు రూపాయల బకాయిని తీసుకుని ఊరు వెళ్లడానికిగాను హైదరాబాద్ వచ్చాడు నవనాథ్. బస్‌స్టేషన్‌లో అనుకోని విధంగా తన ఊరికి చెందిని బ్రరె శివరాజ్ తారస పడ్డాడు. తాను నగరానికి వచ్చి రిక్షా నడుపుతున్నానని చాలా సంతోషంగా వున్నానని శివరాజ్ చెప్పాడు. ఈ సందర్భంగా 'కలిసి తాగుదా'మంటూ ఇద్దరూ బయలుదేరారు. కొంతదూరం వెళ్లాక వారికి తమ పక్క ఊరుకు చెందిన మరో స్నేహితుడు రాజు కనిపించాడు. ఆ ఆనందంతో ముగ్గురు కలసి దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక కల్లు కాంపౌండ్‌లోకి వెళ్లి చిత్తుగా తాగారు. అక్కడినుంచి ముగ్గురు కలసి అఫ్జల్‌గంజ్ వచ్చి, అక్కడున్న మరో కల్లు కాంపౌండ్‌లో మరింత తాగారు. అక్కడినుంచి బయటికి వచ్చిన నవనాథ్ తాను రెండవసారి తాగడానికి చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వమంటూ శివరాజ్, రాజులను అడిగాడు. అందుకు వారు ఇవ్వమంటూ మొండికేసారు. అయినప్పటికీ మనం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ నవనాథ్ పట్టుబట్టాడు.

**హోటల్ యజమాని తనకివ్వాల్సి మూడు వేల రూపాయల బకాయిని తీసుకుని ఊరు వెళ్లడానికిగాను హైదరాబాద్ వచ్చాడు నవనాథ్. బస్‌స్టేషన్‌లో అనుకోని విధంగా తన ఊరికి చెందిని బర్రె శివరాజ్ తారస పడ్డాడు. తాను నగరానికి వచ్చి రిక్షా నడుపుతున్నానని, చాలా సంతోషంగా వున్నానని శివరాజ్ చెప్పాడు. ఈ సందర్భంగా 'కలిసి తాగుదా'మంటూ ఇద్దరూ బయలుదేరారు. కొంతదూరం వెళ్లాక వారికి తమ పక్క ఊరుకు చెందిన మరో స్నేహితుడు రాజు కనిపించాడు. ఆ ఆనందంతో ముగ్గురు "కలసి తాగుదాం...తెల్లమందూ..." అనుకుంటూ ఒక కల్లు కాంపౌండ్‌లోకి వెళ్లి చిత్తుగా తాగారు......ఇక ఆ తర్వాత జరగకూడని ఘోరమే జరిగింది. చివరికి తాగుడు అతని ప్రాణం తీసింది!**

దాంతో ముగ్గురిమధ్యా గొడవ చిలికిచిలికి గాలివానగా మారింది. నవనాథ్‌ను శివరాజ్, రాజులు కొట్టుకుంటూ ఇమ్లీబన్ పార్కులోకి తీసుకు పోయారు. నవనాథ్ దగ్గరున్న మిగతా డబ్బునుకూడా లాక్కోవాలని నిర్ణయించుకుని ఇద్దరూ కలసి తీవ్రంగా కొట్టి కింద పడేసారు. అప్పుడు సమయం అర్ధరాత్రి అవుతుంది. కిందపడ్డ నవనాథ్ తలపై రాజు ఇచ్చిన పెద్ద బండతో శివరాజ్ బాదాడు. అంతేగాక నవనాథ్ జేబులోని డబ్బు, పక్క నున్న రేడియోను తీసుకుని ఇద్దరు పారిపోయారు. తలపై బలమైన గాయం కావడంతో నవనాథ్ అక్కడిక్కడే మరణించాడు. కాగా, నవనాథ్‌నుంచి దోచుకున్న డబ్బుతో రాజు కు వాటా ఇవ్వకుండా శివరాజ్ తరిమేసి రేడియోను కూడా తనే ఉంచుకున్నాడు. అయితే, తాను దాచుకున్న రేడియో ఆధారంగానే చివరికి తనకు సంకెళ్లు పడతాయని అతను ఊహించలేదు.

*** ***

నవనాథ్ హత్యాకేసుపై అఫ్జల్‌గంజ్ పోలీసులు రెండవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో ఛార్జి షీటును దాఖలు చేశారు. ఈ కేసుపై ఆరునెలలపాటు వాదోపవాదాలు జరిగాయి. నవనాథ్‌ను హత్య చేస్తుండగా చూసిన వారెవ్వరూ లేరని, అందుకు సంబంధించి బలమైన సాక్ష్యాలు సైతం లేవంటూ జడ్జి కేసును కొట్టివేసారు. అయితే నవనాథ్‌కు చెందిన రేడియో శివరాజ్ దగ్గర దొరికిన కారణంగా దొంగతనం నేరంపై శివరాజ్‌కు ఏడాదిన్నర జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ఈకేసులో రాజును నిర్దోషిగా తేల్చారు.

-పి.వాసుదేవాచారి

చర్మపు మచ్చలు + కొత్త అన్వేషణ

ప్యాచ్‌క్యూర్ వైద్యము — మచ్చలు పోగొట్టు తేలిక మార్గము

ప్యాచ్‌క్యూర్‌వైద్యము - సంవత్సరాలుగా పరిశోధించి ఎక్స్‌పెరిమెంట్లు మరియు టెస్టులు చేసి నాణ్యత గుర్తించిన తర్వాత రకరకములైన రంగుల మచ్చలుగల అనేకమందిపై 2 నుండి 8 వారములు ప్రయోగించటమైనది. ప్రయోగముచే రంగుమారుట. మచ్చలు పోగొట్టబడి అసలు చర్మము రంగులోనికి మారుట లాంటి అద్భుతమైన గుణములు రికార్డు చేయటమైనది. దీని సరాసరి ప్రభావము చర్మము మరియు రంగును గ్రహించు కణాలపై ఉండుటచే ప్రయోగము మొదలైన వెంటనే ప్రభావము కనబడును మరియు ఏరంగు మచ్చలైననూ తేలికగా తొందరలో మానగలవు. ఎరుపు, నలుపు, తెలుపు లేక ఏ ఇతర రంగు మచ్చలచేనైననూ బాధపడువారు కేవలము 15 దినములు మాత్రమే ఉపయోగించండి మరియు తీక్షణమైన ప్రభావమును చూడండి. పొందుటకు :- వయస్సు, మచ్చరంగు మరియు ఏ భాగముపైనున్నదీ వ్రాసివంపుట తప్పనిసరి.

NATH AYURVEDASHRAM (A-4), P.O.KATRI SARAI (GAYA) 805105